క్లుప్తంగా

చదువులపై నిర్లక్ష్యం చూపొద్దు



మోటుమల్లెలలో పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

రొంపిచెర్ల: చదువులపై విద్యార్థులు నిర్లక్ష్యం చూపరాదని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మోటుమల్లెల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోటు, పుస్తకాలు, యూనిఫాంతోపాటు పథకాలను సద్వినియోగం చేసుకునే ఉత్తమ పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ బండకిందపల్లె పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరసింహులురెడ్డి, సీఆర్పీలు రాజేంద్ర, అన్నసూయ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు



ఆపరేషన్ల కోసం వెళ్తున్న రోగులు

సదుం: మండలంలో గతంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించిన తొమ్మిది మందిని ఆపరేషన్లకు తరలించినట్టు సీహెచ్‌సీ డాక్టర్ పుష్పకుమారి, గిరీష తెలిపారు. వీరికి శంకర్ నేత్రాలయ(చెన్నై)లో ఆపరేషన్లు నిర్వహిస్తారని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. తొలుత ఉదయం 8 గంటలకు భట్టువారిపల్లెలో పర్యటన ప్రారంభమవుతుందన్నారు..

కరాటే పోటీల్లో సత్తా చాటారు



పెద్దపంజాణి: కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరులో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో మండలంలోని మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు 38 మంది పాల్గొని ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. కటా (విన్యాసాలు), కుమితే(ఫైటింగ్) విభాగాల్లో 14 మొదటి బహుమతులు, 12 రెండవ బహుమతులు, 24 మూడవ బహుమతులతో పాటు ఓవరాల్ చాపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డేవిడ్, కరాటే మాస్టర్ డాక్టర్ సదాశివ, విద్యార్థినీ విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.

పచ్చదనం పెంపునకు కృషి



పులిచెర్ల(కల్లూరు): మొక్కలను విరివిగా నాటి పచ్చదనం పెంపునకు అందరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్‌కోర్ గ్రీన్ మాస్టర్ వెంకట సిద్ధులు, కన్వీనర్ రాజేంద్ర కోరారు. సోమవారం కల్లూరు హైస్కూల్లో విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటి వారు మాట్లాడారు. హెచ్ఎం శ్రీవాణి, మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, స్నేహమాలిని, సైదుల్లా, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న లతీఫ్

పుంగనూరు: కరెంటు షాక్‌కు గురై ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు..మేలుపట్లకు చెందిన లతీఫ్ (22) వెల్డింగ్ పనులు చేసి జీవిస్తున్నాడు. చిత్తూరు రోడ్డులో రేకుల షెడ్డు అమర్చుతుండగా పైన 11 కేవీ విద్యుత్ లైన్లు తగిలి శరీరం పూర్తిగా కాలింది. వెంటనే ఆ ప్రాంత వాసులు అతడిని నౌజవాన్ కమిటీ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా బాధితుడిని పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాల తనిఖీ

పలమనేరు: మండలంలోని టీఎస్ అగ్రహారం ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం సోమవారం వారు తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు, వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.

అభివృద్ధితో పుంగనూరు పరుగు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పలుచోట్ల అట్టహాసంగా ప్రారంభోత్సవాలు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో మంత్రికి రక్తపోటు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



అంగన్‌వాడీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా పుంగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. సోమవారం ఆయన మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. బండకిందపల్లె, మోటుమల్లెలలో రూ.6.40 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్లను, బొమ్మయ్యగారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లెలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను, బండకిందపల్లెలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, రొంపిచెర్లలో రూ.1.20 కోట్లతో నిర్మించిన షాదీమహల్‌ను, రూ.40.40 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను, చెంచెంరెడ్డిగారిపల్లెలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని , రొంపిచెర్ల, వంకిరెడ్డిగానిపల్లె, మోటుమల్లెల గ్రామాల్లో రూ.18.20 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. బండకిందపల్లెలో ఆయనకు క్రేన్ సాయంతో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత నిచ్చి, ప్రజలందరికీ మేలు చేశామన్నారు. నియోజకవర్గంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి ఏమిటో చూడవచ్చన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మేలు చేసే ప్రభుత్వాన్నే మరోసారి ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, కల్లూరు సీఐ శ్రీనివాసులు, రొంపిచెర్ల, కల్లూరు ఎస్ఐలు కృష్ణయ్య, రవిప్రకాష్ రెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, డాక్టర్ శ్రీనాథ్, విజయభాస్కర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, యర్రంరెడ్డి, యుగంధర్ రెడ్డి, కె.రవీంద్రనాథరెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, శ్రీనాథనాయుడు, సర్పంచులు నాగిరెడ్డి, సుధారాణి, అన్సర్‌బాషా, అరుణమ్మ, జీవలత తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే రుణం తీర్చుకుంటా



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనను ఆదరించి మరోసారి సీఎం చేయాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. సోమవారం కుప్పం మున్సిపాలిటీలోని 14,15వ వార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ, కుటుంబానికీ మంచి జరిగిందన్నారు. మనరాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాపీ కొట్టి పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను తెలంగాణలో నూతన ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోందని, దీనిని బట్టి చూస్తే మన సీఎం పథకాలు ఎంత ఆదర్శంగా నిలుస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. అలాంటి సంక్షేమ పథకాలను ప్రలజకు అందించినా జగన్‌మోహన్ రెడ్డిని రాబోవు ఎన్నికల్లోనూ ఆదరించాలని ఆయన కోరారు. ఈ నాలుగున్నరేళ్లలో 14, 15వ వార్డుల్లో రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, వైస్ చైర్మన్ మునుస్వామి, స్థానిక కౌన్సిలర్ తిలగవతి తదితరులు పాల్గొన్నారు.

బాబును సాగనంపండి

గుడుపల్లె: చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్న చంద్రబాబుని కుప్పం నుంచి సాగనంపాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పిలుపునిచ్చారు. సోమవారం గుడుపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొని, పార్టీ జెండా ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు. కరోనా విపత్తు నుంచి చంద్రబాబు కుప్పం నియోజక వర్గానికి పూర్తిగా ముఖం చాటేశారన్నారు. 35 ఏళ్లు గెలిపించిన ప్రజలకు న్యాయం చేసిందటూ లేదని, గత ఎన్నికల్లో గెలిచాక హామీలను గాలికొదిలేసిన ఆయన ఇప్పుడు మళ్లీ కొత్త హామీలను ప్రజలు దగా చేసేందుకు వస్తున్నారని, దీనిపై నిలదీయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే, మరింత అభివృద్ధి జరగడంతోపాటు సంక్షేమాలు ప్రతి ఇంటికీ చేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి, సర్పంచ్‌లు చెంద్రాయన్, రామమూర్తి, ఎంపీటీసీ సభ్యులు మూర్తి నారాయణస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

‘స్పందన’ వినతులను పరిష్కరించండి



స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయాశాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పట్టణంలోని కొన్ని వీధుల్లో సమస్యలు, వ్యక్తిగత సమస్యలను ప్రజలు నివేదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, వైస్ చైర్మన్ రవి తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట ఫెన్సింగ్ నిర్మాణానికి భూమి పూజ



కుప్పం చెరువు కట్టపై ఫెన్సింగ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్మన్

కుప్పం: స్థానిక పాతపేటలోని కుప్పం చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రారంభించారు. రోడ్డు పక్కనే చెరువు ఉండడంతో పాదచారాలు, ద్విచక్రవాహనదారులు రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అంతేకాకుండా రోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారికి చెరువు కట్ట వల్ల అసౌకర్యంగా ఉండడంతో ఈ చెరువు కట్టకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయలని పట్టణ ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఇది తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ స్పందించారు. రూ.15 లక్షలతో దీని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● ఆర్థిక సాయం



రామకుప్పం: మండలంలోని చిక్కపల్లితాండాకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రమేష్ నాయక్ సోమవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ ఎంపీపీ సుబ్రమణ్యం చేతుల మీదుగా మృతుని కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక నేతలు చిన్న రాజునాయక్, రవినాయక్, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

● ‘కార్తీక’ సందడి



సదుం: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఎర్రాతివారిపల్లె జ్ఞానమల్లేశ్వరస్వామి ఆలయం, స్థానిక వీరభద్రస్వామి, మరకేతశ్వరస్వామి, మత్తుకువారిపల్లె మల్లేశ్వరస్వామి, జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి, అరుణాచలేశ్వరస్వామి, పుట్టావారిపల్లె మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపుపై హర్షం

పుంగనూరు: మండలంలోని ఇటుకనెల్లూరు దళిత వాడకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించడంపై దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ, తమకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని మంత్రిని పల్లెబాట కార్యక్రమంలో కోరామన్నారు. దీనిపై మంత్రి స్పందించి 43 సెంట్ల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. దీనిపై గ్రామస్తులు గిరి, గోపాల్, రమేష్, మధు, శంకర్, జగన్‌మోహన్, లింగప్ప, రమణ తదితరులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కాలనీకి మట్టి రోడ్డు వేశారు



పలమనేరు: మండలంలోని జరావారిపల్లె బీసీ కాలనీకి చాలా ఏళ్లుగా సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్య తీరింది. ఇక్కడి సమస్యను ప్రజలు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని సర్పంచ్ వనితకళను ఆదేశించారు. ఆ మేరకు పంచాయతీ అధికారులు కాలనీకి మట్టిరోడ్డు వేశారు.

మద్యం నగదు బ్యాంకులో జమ చేయాలి

రొంపిచెర్ల: ప్రతిరోజూ మద్యం అమ్మకాల రూపేణా వచ్చిన నగదును మరుసటి రోజు తప్పనిసరిగా బ్యాంకులలో జమ చేయాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణశాస్త్రి ఆదేశించారు. సోమవారం రొంపిచెర్లలోని మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. బ్యాంకుల్లో సొమ్ము జమ చేయకపోతే సూపర్‌వైజర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌కు మద్యం స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు, లోకనాథ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కురబలకు ప్రాధాన్యతనిచ్చింది వైఎస్సార్ సీపీనే

- కనకదాస్ విగ్రహ ప్రతిష్ఠాపన కుప్పం చరిత్రలో నిలిచిపోతుంది
- 24న కనకదాస్ జయంతి మహోత్సవాలు
- దీనిని రాజకీయం చేయడం తగదు : ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, కురుబ నేతలు

కుప్పం: నియోజకవర్గంలో అధికంగా ఉన్నా కురుబ కులస్తులు సామాజిక వర్గానికి ఆరాధ్య దైవంగా భావించే భగవాన్ కనకదాస్ విగ్రహ ప్రతిష్ఠాపన కుప్పం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కురుబ కుల సంఘ నాయకులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కుప్పం ప్రాతంలో రెండవ స్థానంలో ఉన్న కురుబ సామాజిక వర్గాన్ని గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కొందరు కుల సంఘ నాయకులు విజ్ఞప్తిపై స్పందించి కుప్పంలో కనకదాస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఈ నెల 24న కనకదాస్ జయంతి పురస్కరించుకుని కుప్పం గేట్ వే వందపడకల ఆస్పత్రి వద్ద విగ్రహావిష్కరణకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కుప్పం ప్రాంతంలోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు సరిహద్దులోని కురుబ సామాజిక వర్గానికి చెందని ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కురుబ సంఘ నాయకులు ఆరెళ్ల జయప్ప మాట్లాడుతూ, ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా కురుబ కులస్తులకు సముచిత ప్రాధాన్యత ఇచ్చింది లేదని విమర్శించారు. తొలిసారి వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్సీ భరత్ కనకదాస్ మహోత్సవాలు నిర్వహణకు సహకరించారని, అయితే దీనిని కూడా కొందరు రాజకీయాలతో పెడదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. అందరూ కలసికట్టుగా కనకదాస్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గ కురుబ సంఘ నాయకులు మునిరత్నం గౌడ్, శ్రీనివాసులు, సురేష్ , సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

భరత్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి





సారె పంపిణీ చేస్తున్న దుర్గ, కంగుంది ఎస్సీ కాలనీలో స్థానికుల సమస్యలు ఆలకిస్తున్న పద్మమ్మ

కుప్పం రూరల్: రాబోవు ఎన్నికల్లో కుప్పం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భరత్‌కు కుప్పం ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే ప్రజలకు రుణపడి ఉంటామని ఎమ్మెల్సీ భరత్ తల్లి పద్మమ్మ, ఆయన భార్య దుర్గ అభ్యర్థించారు. సోమవారం మండలంలోని కమతమూరులో దుర్గ మహిళలకు సారె పంపిణీ చేసి మాట్లాడారు. అలాగే, పద్మమ్మ కంగుంది ఎస్సీ కాలనీని సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ, కుప్పంలోని గ్రామాలను చూస్తుంటే చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ అభివృద్ధి చేసిన పాపానపోలేదని ప్రజలే విమర్శిస్తున్నట్టు చెప్పారు. భరత్‌కు ఈ పర్యాయం ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపుతారన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, స్థానిక నాయకుడు నిత్యానందం, కౌన్సిలర్లు నాగరాజు, సయ్యద్ ఆలీ, కుమార్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు



పుంగనూరు: బుక్‌లెట్లతో ప్రచారం చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా



పుంగనూరు : మాగాండ్లపల్లెలో..

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని రాంనగర్ సచివాలయ పరిధిలో చైర్మన్, మండలంలోని మాగాండ్లపల్లెలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. బుక్‌లెట్లతో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు భారతి, సాజిదాబేగం, పార్టీ నాయకులు ఇంతియాజ్, రమణ, సలామత్, సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి, ఎంపీటీసీ నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్ గంగాధర్, పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ప్రజలకెంతో మేలు చేసిన జగనన్న

పలమనేరు: జగనన్న తన పాలనలో ప్రజలకు ఎంతో మేలు చేశారని, దీనిని గుర్తించి మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని పట్టణ కన్వీనర్ జాఫర్ విజ్ఞప్తి చేశారు.. మున్సిపాలిటీలోని 5వ వార్డులో జాఫర్, 10వ వార్డులో షబీర్, 7వ వార్డులో మున్నాల ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని, చేసిన అభివృద్ధిని వివరించారు.

పత్తికొండలో..

గంగవరం: ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పత్తికొండ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి సచివాలయ పరిధిలో పథకాల లబ్ధి, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పథకాలు మళ్లీ ప్రజలకు అందాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను ఆదరించి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ రవినాయుడు, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, సిద్ధప్ప, జేసీఎస్ కన్వీనర్ వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీర్థంలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం సచివాలయం పరిధిలో సోమవారం వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు ఎగురవేశారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, పార్టీ మండల కన్వీనర్ కార్తీక్, సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ, పార్టీ నాయకులు శ్రీనివాసులు, బాలాజి, మునేగౌడు, లక్ష్మీనారాయణ, రెడ్డి వీనస్, శేఖర్ పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె : తీర్థం సచివాలయంలో..







పలమనేరు : వైఎస్సార్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న జాఫర్, ఇందిరమ్మకాలనీలో కరపత్ర ప్రచారం చేస్తున్న మున్నా, గంగవరం : బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఇందిర

రొంపిచెర్ల: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ ఇందిర మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. పిల్లలు ఆటపాటలతో విద్యను నేర్చుకోవాలన్నారు. పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు లక్ష్మీదేవి, ఐఈఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

గురు బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గుడుపల్లె: కార్తీక మాసం చివరిరోజు పురస్కరించుకుని సోమవారం గుడివంక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో జగద్గురు శ్రీగురు బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవ లింగాయత్ జంగమ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మల్లప్ప కొండపై ఉన్న శ్రీ మల్లేశ్వస్వామి ఆలయం వద్ద కొండపై జ్యోతి వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

లారీ ఢీ : మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

పుంగనూరు: లారీ ఢీకొనడంతో మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..పట్టణంలోని మేలుపట్లకు చెందిన బాలాజి (24) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మూడో మైలు క్రాస్ వద్ద మితిమీరిన వేగంతో ఎదురుగా వచ్చిన లారీ అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజి తీవ్రంగా గాయపడ్డాడు. లారీ ఢీకొన్న ధాటికి బైక్ నుజ్జునుజ్జైంది. బాలాజిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.